


“ఈ సంగతి విన్నావా?” అంటూ వూడిపడ్డాడు ఆంజనేయులు.

వార్తలు సేకరించడంలోనూ, ప్రచారం చేయడంలోనూ దిట్ట ఆంజనేయులు. తాష్కెంటులో శాస్త్రిగారు మరణించారనీ, ఇందిరా ప్రభుత్వం బ్యాంకుల్ని జాతీయం చేసిందనీ, బాంగ్లా దేశ్‌లో పాక్ సైనికులు శరణాగతి పొందడానికే నిర్ణయించుకున్నారనీ మొట్టమొదట నా చెవిలో వేసినవాడు ఆంజనేయులే! ప్రచార సాధనాల జాబితాలో రేడియోలకు, వార్తాపత్రికలకు మధ్యలో అతడి స్థానం. వినవలసి వచ్చే వార్తలెప్పుడూ శుభవార్తలుగానే వుంటాయన్న భరోసా ఏముంది? అందువల్ల ‘‘ఈ సంగతి విన్నావా?’’ అంటూ ఆంజనేయులు ఎదురైనప్పుడల్లా నాకు ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

గుహ బయట నిలిచి సింహంగర్జిస్తూ వుంది. అది లోపలికివస్తే తన పని ఖాళీ అని మేకపోతుకు తెలియదా? అయినా ఆఖరుక్షణంవరకూ ఆత్మరక్షణకోసం ఉపాయం వెదకడం ప్రాణికి నైజగుణం. నేనూ నా బేలతనాన్ని మేకతోలు గాంభీర్యంతో కప్పిపుచ్చుకుంటూ నింపాదిగా “ఏ సంగతి?’’ అన్నాను.

“ఒక ఆడమనిషి సైకిలు త్రొక్కుతుంది” అన్నాడు ఆంజనేయులు.

నేనతడి ముఖంలోకి పరిశీలనగా చూచాను. అందులో ఉన్మాద లక్షణాలేవీ పొడగట్టడంలేదు.

“చూడవోయ్ ఆంజనేయులూ! ఎదుటివాణ్ని ఆశ్చర్యచకితుణ్ని చేయదలచుకుంటే నువ్వు మరి కొంచెం తాజావార్తలు సేకరించాలి. ఇప్పుడు నువ్వు చెప్పింది చాలా పాత వర్తమానం. ఇంకా ఒక ఆడమనిషి చంద్రమండలంలో దిగిందని చెప్పు! దాన్ని నేను ‘న్యూస్’గా తీసుకుంటాను” అన్నాను.

నా అమాయకత్వానికి జాలిపడుతున్నట్టుగా గొల్లున నవ్వేశాడు ఆంజనేయులు— “అబ్బే, పూర్తిగా వినిపించుకోవే నువ్వు! ఈ ఆడమనిషి తెరపిలేకుండా, సీటుపైన్నుంచి క్రిందికి దిగ

కుండా మూడురోజులు, అంటే నిండుగా డెబ్బయి రెండుగంటలు సైకిలు త్రొక్కు తుంది. అదీ సంగతి!''

నేను తెల్లబోయి చూచాను ఆంజ నేయుల వైపు—"గంటకు పది పన్నెండు కిలోమీటర్లనుకున్నా దాదాపుగా ఏడెని మిది వందల కిలోమీటర్ల ప్రయాణ మన్నమాట! మనది కాదనుకుని ఓ యాభై రూపాయలుపెట్టి టికెట్టు కొను క్కుంటే రైల్లో అంతదూరం హాయిగా వెళ్ళొచ్చు. ఒళ్ళుహూనమై పోవడానికి గాకపోతే, ఎందుకొచ్చిన సైకిలయ్యా ఆంజనేయులూ !"

"అలా ఏకటాకీగా ఒకచోటినుంచీ, యింకొక చోటికి వెళ్ళిపోయే పనిగాదు! ఎద్దులు నూనె గానుగను లాగడం చూచావా? ఈవిడ ఆ మోస్తరుగా సైకిల్ త్రొక్కుతుంది. ఎక్కడోగాదు. మన సినిమాహాలుకు ముందరున్న మైదా నంలో! ఎప్పుడో గాదు, ఈరోజు సాయంకాలం అయిదు గంటలకే ప్రారంభం!"

'ఆవిడకు నా సానుభూతి' అనిచెప్ప బోయి, అంతలో నా సందేహాలు నన్ను బాధించడంవల్ల ఆ మాటను మనసులోనే ఉపసంహరించుకున్నాను.

"మన యింట్లో మన ముంటాం. అక్కడ ఆమె పాదాలను నేలపైన మోప లేదనడానికి దాఖలా ఏముంటుంది? రాయి రాయి కరిగే అర్ధరాత్రి వేళలో ఆవిడ ఏం చేసినా చెయ్యొచ్చు గదా !" అన్నాను.

"ఆ పప్పులేం వుడకవు! నిఘానంఘ మంటూ ఒకటి నిన్ననే ఏర్పడింది..."

"కొంపదీసి అందులో నువ్వుగూడా ఒక సభ్యుడివా ఏమిటి?'' ఆశ్చర్య పోతూ అడిగాను.

సగర్వంతో బదులు చెప్పాడు ఆంజ నేయులు—"పబ్లిసిటీ అంతా మనదే!"

అంతటితో తనపని పూర్తయినట్టు ఆంజనేయులు అలా బయటికి వెళ్ళి పోగానే, నేను వంటింటి వైపుచూస్తూ గొంతెత్తి "ఏమిటేవ్, విన్నావా?'' అన్నాను.

"విన్నాను, విన్నానులెండి!" అంటూ ఈడ్చి వదిలిపెట్టిన బాణంలావచ్చి గడప దగ్గర నిలబడింది మా ఆవిడ — "మా నాన్నగారు చెబుతుండేవారులెండి! అంటే టపా పద్ధతి అంటూ ఒకటి వుండేదట! ఇంక మీరు కానివ్వండి ప్రచారం!"

"అబ్బే, నీమీద ఒట్టేననుకో సుబ్బులూ! నాకా సైకిలు త్రొక్కే ఆవిడ ఏ మాత్రం ఇంటరెస్టు లేదు. నా యింట రెస్టల్లా ఈ ఆంజనేయులు పైన్నే! వీడి కిదంతా ఎందుకొచ్చిన బాదరబందీ చెప్పు!"

"మీదొకపాడు! ఆ యిల్లాలు పుట్టిం టికి వెంచేసి మూణ్నెల్లయింది. ఎప్పు డొస్తుందో ఏమిటో, అసలొస్తుందో రాదో చెప్పేవాళ్లులేరు. ముగ్గురు బిడ్డల్లో పెద్ద వాడు కాన్వెంటులో వుండి పోయాడా, చిన్నబిడ్డను తల్లిగారు తరలించు కెళ్ళిందా, ఈయన పాలిటి కొకడు మిగి లాడు. వాడా ముసలావిడ ఏదో వండి పెడితే తింటాడు. పగటివేళ బడిలో కెళ్తాడు. రాత్రిపూటనాయనమ్మప్రక్కన పడుకుని నిద్రపోతాడు. ఇక ఈయన కేమీ పనిలేకపోతే కాలం ఎలా గడిచే టట్టు? చూచారుగా యిదీ వరస! పూర్వ కాలంలో నాట్యంచేసే మనిషి వెనుక నట్టువకాడని ఒకడుండేవాడట? ఈయన గారా సైకిలు త్రొక్కే ఆవిడ వెనుక బాకా వూదుతూ తిరిగినా అడిగే వాళ్లుం డరు...''

"చూచావా సుబ్బులూ! ఎంతయినా ఆడబుద్ధి పోనిచ్చుకున్నావుగావు! అప్ప టికా యిల్లు అలా కావడానికి బాధ్య తంతా ఆంజనేయులదే అయినట్టు ధ్వని స్తావు. పాపం, వాడినేమైనా అంటే కళ్ల పోతాయి. వాణ్ని ముప్పతిప్పలుపెటి మూడు చెరువుల నీళ్ళు త్రాగిస్తున్నం దుకు నువ్వు శాపనార్థాలు కుమ్మరించ దలిస్తే నీ తోటి యిల్లాలుపైన్నే కుమ్మ రించాలి. అదే న్యాయం! అదే ధర్మం!"

"ధర్మపన్నాలు బాగానే చెబుతా ర్లెండి! ఎంత పెద్దదైనా గుమ్మడికాయ కత్తికి లోకువే! లేదంటే కత్తికి పదు నుండాలి. కత్తికి పదునులేదూ, కాయ తెగదు. అందుకు ఒకర్నని ఏంలాభం?"

మా ఆవిడ సాంప్రదాయిక విజ్ఞా నానికి కాణాచి. ఆమెతో సాహచర్యం వల్ల అ విజ్ఞానం నాకూ అంతో యింతో అబ్బింది. అందువల్ల వీలయినంత హుటా హుటిగానే ఆమెను ఎదుర్కోగలిగాను.

"మునుపటి కొకావిడ భర్తతో 'మీది తప్పయితే మీరే పోతారు. నాది తప్ప యితే నా మాంగల్యమే పోతుంది' అందట! అంత సబబుగానే వుంది, నువ్వు భార్య ప్రవర్తనకు భర్తదే పూచీ అనడం!"


"సర్లెండి బాబూ! మీతో మాటలు పెట్టుకుంటే యిక నా పనైనట్టే"అంటూ వినవిన నడిచిపోయింది సుబ్బులు.

వాదాన్ని నోరుమూయించే ప్రతి వాదం దొరకనప్పుడు పొయిమీద వంట మాడిపోతోందని తప్పించుకోడంసులువే! అది ఉష్ట్రపక్షి నేర్పినవిద్య. కానీ కళ్ళు తెరచుకుని వాస్తవ పరిస్థితులదృష్ట్యా ఆంజనేయుల కుటుంబగాథను పరిశీలిస్తే ఎవరికైనా అతడిపట్ల జాలి మాత్రమే కలుగుతుంది.

ఆంజనేయులు భార్య పేరు రాధా కల్యాణి. మరేం లేదు. తండ్రి ఆమెను 'రాధా' అని పిలిచేవాడు. తల్లి'కల్యాణీ' అంటుండేది. వెరసి తల్లిదండ్రుల ముద్దు మురిపాలను కలబోసుకుని ఆమె 'రాధా కల్యాణి' అయింది.

రాధాకల్యాణిదొక తిరుగులేని అభిప్రాయం. తాను పుట్టినపట్టణమేదైతే వుందో దాని ఎదుట మిగిలిన వూళ్ళు

పైసాకైనా పనికిరావు. ఆ పట్టణమే పట్టణం. అక్కడి బావుల్లోవూరేదిగంగ. అక్కడ పుట్టిన ఆడమనిషి రంభ. అక్కడి మగవాళ్ల రెక్కలు మొలవని గంధర్వులు. 'ఇంత మాత్రం మావూళ్లో అయితేనా?' అన్నది ఆమె వూతపదం. స్వస్థలంపైన అంతటి గాఢమైన అభిమాన, మమకారాలు కలిగివున్న అమ్మాయిని పరాయివూళ్లో ఒక మనిషికిచ్చి పెళ్ళిచేయడం పొరబాటేననిపిస్తుంది. ఐతే ఒకటి. ఆమెను గురించి లోకానికి తెలిసినంతకన్నా తల్లిదండ్రులకేఎక్కువగా తెలిసివుండొచ్చు. పెళ్ళయినకొంత కాలానికే ఆ వూహను నిజంచేసింది రాధాకల్యాణి. ఆంజనేయులు తన కాపురాన్ని పల్లెనుంచీ దగ్గర్లోవున్న బస్తీకి మార్చవలసివచ్చింది.




భార్య అభిమతానికి తల ఒగ్గినప్పటికీ ఆంజనేయులు తన జాగ్రత్తలో తానుండడం యిక్కడ గమనార్హమైన విషయం. భార్య ఉద్దేశాన్ని తూచా తప్పకుండా పాటించే పక్షంలో అతడు పల్లెలోవున్న ఆస్తిపాస్తులను తెగనమ్ముకుని కాపురాన్ని అత్తగారి వూరికే తరలించవలసి వుండేది. అలా చేయకుండా ఆంజనేయులు మధ్యేమార్గం అవలంబించాడు. ఉన్న భూస్థితిలో సగంమాత్రమే అమ్మకంచేసి, ఆ డబ్బు తీసుకొచ్చి ఓ నమ్మకమైన ఫైనాన్సు కార్పొరేషన్‌లో పెట్టాడు. మిగిలివున్న పొలాలపైనవచ్చే తిండిగింజలు భోజనానికి సరిపోతాయి. ఫైనాన్సు కార్పొరేషన్ నుంచీ గిట్టుబాటయ్యే వడ్డీడబ్బులతో పై ఖర్చులు కొట్టుకపోతాయి. పెళ్ళానికి కావలిసింది పట్నవాసం. అదెలాగూ ఆమెకు సమకూరింది. తనకు రావలిసింది తన వ్యక్తిత్వం దివాలాతీయకుండావుండడం. అత్తవారికీ తనకూ మధ్య వుండవలసినంతదూరం వుంది గనుక తన వ్యక్తిత్వానికిన్నీ ముప్పులేదు. ఎటొచ్చీ ఉద్యోగం పురుషలక్షణం గనుక కాలక్రమాన ఈ బస్తీలో తాను ఏదో చిన్న వ్యాపారం ప్రారంభిస్తాడు.

ఇక నీ కాపురాన్ని నువ్వు చక్కబెట్టుకోమంటూ అతడు భార్యకు 'లైన్ క్లియర్' చేసి వదిలిపెట్టాడు.

ఐతే దిక్సూచి ఎప్పుడూ ఉత్తర దిక్కునే చూపించినట్టుగా రాధాకల్యాణి ధ్యాన నిరంతరం పుట్టింటివైపే ప్రసరించడం ఆంజనేయుల దురదృష్టం. కానుపు రావడానికి ఆరు మాసాలు ముందుగా పుట్టింటికి వెళ్ళిపోతే, ఆమె ఆరు నెలల బిడ్డతోగానీ కాపురానికి తిరిగొచ్చేదిగాదు. ముగ్గురన్నలతో,యిద్దరక్కచెల్లెళ్ళతో, యింకా మేనత్తలతో, పిన్నమ్మలతో ఆమెకు పెద్ద సేనలాంటి పుట్టింటి బంధుబలగం వుంది. ఆ కుటుంబాల్లో ఎక్కడ నామకరణం జరిగినా, ఎక్కడ అన్నప్రాశనం జరిగినా, ఎక్కడ తలనీలాలు తీసినా అప్లికేషన్ వ్రాసి టేబిలుపైన పడవేసి, సెలవు మంజూరైనా కాకపోయినా గైర్‌హాజరు చిత్తగించే ఉద్యోగిలా వెళ్ళిపోతుంది రాధాకల్యాణి. భర్త తనను స్టేషనుదాకా సాగనంపాలనిగానీ, ఓ గడువుపెట్టి అది దాటకుండా తిరిగిరావాలనిగాని ఆమెకు పట్టింపులులేవు. ఒక్కొక్కప్పుడు శుభాశుభ కార్యాలనేవేవీ కలిసిరాకపోతే రాధాకల్యాణికి ఏ చెయ్యో, కాలో బెణుకుతుంది. ఏ తలనొప్పో ముంచుకొస్తుంది. ఆమెకొచ్చే జబ్బుల్ని నయంచేసేడాక్టర్లు వాళ్ళ వూళ్లో తప్పితే ఈ భూప్రపంచకంపైన మరెక్కడా లేరు. మళ్ళీ ప్రయాణానికి ఆయత్తం కావలిసిందే! ఆంజనేయులు నచ్చజెప్పే ప్రయత్నంచేశాడు. నిర్మొగమాటంగా వాదించాడు. మామగారికి ఉత్తరాలురాసిచూశాడు. లోకంలో ఒకరివల్ల యింకొకరికి దురన్యాయం జరిగితే వెళ్ళి మొరపెట్టుకోడానికిన్యాయస్థానాలున్నాయి. ఆంజనేయుల గోడు వినిపించుకునే కోర్టులేవీ లేకపోయాయి. ఎప్పుడో తనకిష్టమైనప్పుడు ఇల్లాలు తిరిగొస్తుంది. ప్రయాణానికీ ప్రయాణానికీ మధ్య ఆమెకాపురం వెలిగించే కొద్దిపాటి కాలంలోగూడా ఏవో లేనిపోనిగొడవలతో ఆయిల్లొక ప్రచ్ఛన్నపోరాటానికి రంగస్థలంగా వుంటుంది. సామరస్య వాతావరణం నెలకొల్పడానికి ప్రయత్నించని దోషం ఆంజనేయులది గాదు. సినిమాకు వెళ్దామని అతడు ప్రపోజలు తెస్తే ఆమె

"ఈ వూళ్లో థియేటరుకా! అంతకంటే కాటికి వెళ్ళడం నయం!" అంటుంది. ముచ్చటపడి అతడొక చీర తీసుకొస్తే ఆమె నిరుడు సంక్రాంతి పండగప్పుడు తనపుట్టింటివాళ్ళు పనిమనిషికి పెట్టిన చీర యిలాంటిదేనంటుంది!

సాంసారిక జీవితం ఒకవిధంగా చిత్రహింసలా తయారు గావడంతో ఆంజనేయులెప్పుడూ ఏదోఒక అమూల్య వస్తువును పోగొట్టుకున్నవాడిలా కనిపిస్తాడు. ఏదైనా ఒక అఘాయిత్యం చేయాలనుకుని, ఏంచేయాలో, ఎలా చేయాలో తోచనివాడిలా కనిపిస్తాడు.

*　　*

పెళ్ళి, పేరంటం, తెప్ప, తిరణాల, ఏదిజరిగినా ముందుగా నేనున్నాననిపలికే గ్రామఫోను రికార్డుల సంరంభం సినిమా హాలు దగ్గరున్న మైదానంలో ఆరోజు మధ్యాహ్నంనుంచే ఆరంభమైంది. చెవులకు అలవాటుపడిపోయిన గోలే గనుక మొదట దానిసంగతి ఎవరూ పట్టించుకోలేదు. మధ్యాహ్నం మూడుగంటలప్పుడు హఠాత్తుగా ప్రకటన వెలువడింది.

"మహాజనులారా! మహిళామతల్లులారా! యువరటెన్షన్ ప్లీస్! దయచేసి వినండి! ఒక విజ్ఞప్తి!"

మాట్లాడుతూ వున్నవాళ్ళు మాట్లాడ్డం మానేశారు. నడుస్తూ వున్నవాళ్ళు నడవడం మానేశారు. ఎవరేపని చేస్తున్నా కట్టిపెట్టి ప్రకటన వినవచ్చిన వైపుకి చెవులురిక్కించి ఆసక్తిగావినసాగారు.

"ఆరోగ్యవంతుడికి రోగబాధ ఎలాంటిదో తెలియదు. ధనవంతులకు దరిద్రం ఎంత దారుణంగా వుంటుందో అర్థంగాదు. నీడపట్టున నిల్చున్నవాళ్ళకు మండుటెండల కరకుదనం బోధపడదు. అందువల్ల బ్రతుకనేది ఎన్నెన్ని యాతనలతో కూడుకునివున్నదో తెలియని అదృష్టవంతులందరికీ యిదేమాఅభ్యర్థన అయ్యలారా!అమ్మలారా! శ్రమ అనుకోకుండా ఒకసారి యిక్కడికి విచ్చేయండి ఇక్కడొక అబల ఎక్కిన సైకిలు దిగకుండా, పెడలుపైన మోపినకాలుక్రిందికి జారకుండా, కంటిపైన రెప్పవేయకుండా మూడుపగళ్ళు, మూడురాత్రులూ ఏకబిగిన సైకిలు త్రొక్కబోతూవుంది. ఎందుకోసం? అడగండిబాబూ, అడగండి! ఎందుకోసమని అడగండి! జానెడు పొట్టకోసం. పడవలసిన అవస్థలన్నీ పడి మగవాడు సంపాదించుకొచ్చి పడవేస్తే హాయిగా తినికూర్చుని పెత్తనాలు చలాయించే అమ్మలక్కలకీమాట ఆశ్చర్యం కలిగించవచ్చు. అందుకే అలాంటి వారికందరికీ యిదే మా ప్రత్యేకాహ్వానం! విచ్చేయండి!! మీసాటి ఆడమనిషి సైకిల్ త్రొక్కబోతూవుంది. త్రొక్కేది మీరు కాదు గనుక చూచి ఆనందించండి!"

"ఓయబ్బో! విన్నారా విసుర్లు" అంది సుబ్బులు.

"సుబ్బులూ! నువ్వుభుజాలు తడువుకోడం లేదుగదా!" అన్నాను నోరు జారి.


"అవున్లెండి! పట్టెమంచాలా, పట్టుపానుపులా, ఏడువారాల సొమ్ములా, ఎందులో కొదవైందినాకు! నాబ్రతుక్కునేను భుజాలు తడువుకోవలసిందే!" భుజంపైన జాకెట్టుకు వేసుకున్న కుట్టు తెలియకుండా పైటచెరగు కప్పుకుని కన్నీళ్ళు పెట్టుకోబోయింది సుబ్బులు.

ఆదమరచి సలసలకాగుతున్న నీళ్ళు ఒక చెంబెడు తీసి తలపైన దిమ్మరించుకున్నట్టయింది. ఆపైన నోరు తెరచి వుంటే ఒట్టు!

ప్రారంభోత్సవ శుభముహూర్తానికి సరిగ్గానేను రీడింగు రూములోవున్నాను. అప్పటికప్పుడే ప్రత్యక్షకథనం ప్రారంభమైనట్టుంది?

"సోదరులారా! చూస్తున్నారుగదా! సైకిల్ కదిలింది. మెల్లగా తిరగడం ప్రారంభించింది. క్రమంగా వేగం పుంజుకుంటుంది. ఇలా నిర్విరామంగా మూడు రోజులపాటు, కొన్నివేల వలయాలు తిరుగుతుంది. కనుకట్టు గాదు. ఇంద్రజాలం కాదు. కేవలం శరీరకష్టం. భగవంతుడు కరుణాసముద్రుడు. శారీరకంగా మనుషులనందరినీ ఒక చేరకంగా సృష్టించాడు.ఐతే ఈశరీరాల్లో భోగాలు లభించేది, యోగాలుచేకూరేది కొన్నిటికే! ఆడజాతిలో ఈ వర్గాన్ని పూవుబోడులంటారు. పువ్వులా ముట్టుకొంటే కందిపోయే వాళ్ళన్నమాట! దూరంగా ఎవరో దంపకాలు చేస్తుంటే ఆ రోకళ్ళ చప్పుడు చెవినపడేసరికి మునుపటి ఒక రాజుగారి భార్యామణికి చేతులు బొబ్బలెక్కిపోయాయట! జరుగుబాటుంటే జరిగేదది! జరుగుబాటు లేనప్పుడు పొట్టకింత తిండికోసం, ఒళ్ళుకింత బట్టకోసం, శరీరాన్ని ఎంతగా గానిపెట్టుకోవలసి వుంటుందో, యిదిగో యిక్కడొక సోదరి నిరూపిస్తూవుంది. ఎవరెవరి వృత్తి వ్యాసంగాల్లో వారు సతమతమౌతూ మీమీ గృహిణులకు వీలైనన్ని ఎక్కువ సదుపాయాలు కల్పించడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్న గృహస్థులారా, మీ బాధలు మాకు తెలుసు! సుఖపెట్టడంలో లోపం జరుగుతూవుందన్న అసంతృప్తి ప్రతియింటా వుంది. అలాంటి విఫల మనోరథుల కందరికీ యిదొక మహదవకాశం! ఎలాగైనా జనానావారిని ఒకసారి యిక్కడికి తీసుకొచ్చే ప్రయత్నం చేయండి! వాళ్ళిలా సైకిలు త్రొక్కవలసిన పనిలేదు. మగవాడిగుండెలపైన స్వారీ చేయకుంటే చాలు! మన బాధలు ఏ మాత్రం తగ్గినా తగ్గినట్టే!''

ప్రక్కన కుర్చీలో కూర్చుని దినపత్రిక చూచుకుంటున్న రిటయిర్డు తాశీల్దారు శంకరప్పగారు "ఎవరోగానీ భలే గమత్తుగా చేస్తున్నాడండీ వ్యాఖ్యానం" అన్నాడు.




"ఆంజనేయులని ఒకతను వున్నాడు లెండి" అన్నాను.

"పాపం, స్వానుభవంలావుంది. దెబ్బ తగిలిన మనిషల్లేవున్నాడు. అసలిందులో వున్న కిటుకేమిటండి సీతాపతిగారూ..."

ఆ కిటుకేమిటో తెలుసుకోవడానికి వీల్లేకుండా మైకులోమళ్ళీ ఆంజనేయుల గొంతుక వినిపించింది.

"మహాజనులారా! ఒక ప్రకటన! ఈరోజు రాత్రి పదిగంటలకు యిక్కడ సైకిలుపైన ప్రత్యేక ప్రదర్శనలు జరుగబోతున్నాయి. ఆఫీట్సును గురించి చెప్పి లాభంలేదు. చూచి తీరవలసిందే! తప్పకుండా రావలసిందని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం..."

రీడింగురూము మూసేదాకా అక్కడే వుండిపోయి, బాగా చీకటిపడిన తర్వాత తిరిగొస్తున్నాను. దారిలో పదిమంది గుమిగూడిన ప్రతిచోటా సైకిల్‌వాలీకి సంబంధించిన ప్రసంగాలే విన వస్తున్నాయి.

"ఎంతనైసుగా వెళిపోతుందిరా. సైకిల్ అసలు తొక్కినట్టేలేదు. దానంతటదే తిరిగిపోతున్నట్టుంది." ఓ హైస్కూలు కుర్రాడు స్నేహితుడితో చెబుతున్నాడు.

ఇంకొకాయన ఎదురైన పెద్దమనిషిని రోడ్డుపైన నిల్చోబెట్టి సైకిల్ త్రొక్కుతున్నావిడ వయోరూపాలను వర్ణిస్తున్నాడు.

"నేనింకా పొడుగ్గా, లావుగా అవిడొక ఆడ వస్తాదులా వుంటుందనుకున్నాను సార్! నా వూహ పొరబాటు. అంత పొడగరీకాదు, పొట్టీగాదు, సగటు పొడవనుకొండి! కోలమొగం, ఉంటే గింటే పాతికేళ్ళుంటాయేమో! సైకిలు తొక్కడానికి వీలుగా పాంటుగానీ, పైజమాగానీ తొడుక్కోవచ్చుగదా! అదేంలేదు. చక్కగా చీరెకట్టింది. పైట చెంగును నడుముకు బిగించింది. 'చూడండి. నేనెంతటి పనిచేయబోతున్నానో' అన్న పోజు ఏకోశానా లేదంటే నమ్మండి! వినయంగా తన పనేదో తాను చేసుకపోతోంది. తల్లో పువ్వులు, పెదవులపైన చిరునవ్వులు, యిదే ఆమెలో ఆకర్షణనుకోండి! ఆ పువ్వులు వాడకుండా, ఈ పువ్వులు వీడకుండా తానీ మూడురోజుల సైకిలు వ్రతాన్ని నిరభ్యంతరంగా పూర్తిచేయబోతూ వున్నానన్న ఆత్మస్థయిర్యం మట్టుకూ ఆమెలో దండిగానే వున్నట్టుంది..."

ఎదురెదురు గుమ్మాల్లో నిలబడి ఇద్దరాడవాళ్ళు మాట్లాడుకుంటున్నారు.

"ఏం చోద్దెమమ్మా పార్వతీ! ఇంతకూ ఆవిడకు పెళ్ళయినట్టా?" ముసలావిడ ప్రశ్న.

"కాలి వ్రేలికి మెట్టెలు, మెడలో నల్లపూసలదండా కనిపిస్తుండగా, ఆ విషయంలో సందేహ మెందుకండీ పెద్దమ్మగారూ! పెళ్ళయిన మనిషేనట! ఆ మొగుడి సంగతి విన్లేదే మీరు! నల్లగా యినపగుదిలా వుంటాడట! ఆగిరజాలు, మిడిగ్రుడ్లు చూడ్డానికే భయమేస్తుందట! మా యింటాయన చూచొచ్చారుగదా! అయ్యో, పాపమంటూ ఆవిడపైన ఒకటే జాలిపడిపోతున్నారు...''

"ఏం చేద్దామమ్మా! కాకి ముక్కుకు దొండపండన్నారు మరి! అలాంటి జంటను చూచే అయివుంటుంది!"

ఇంటికివెళ్ళి భోజనం చేశాను. గంట ఎనిమిదిన్నర కావచ్చింది.

"కాసేపు చదువుకుంటారా? పెరట్లో పడక వేయమన్నారా?" అంది సుబ్బులు.

"రెండూ కాదు. ఊరిబయటకు వెళ్ళొద్దామనుకుంటున్నాను...''

"సైకిలు స్వారీచూచి రావడానికే గదా! ఏమండీ! జనానావారిని వెంటబెట్టుకెళ్ళాలని చూస్తున్నారా? అదేంకుదరదు. ఇంటెడు చాకిరీతో ఒళ్ళు గుల్లచేసుకునే ఆడవాళ్ళున్నారు. కట్టుకున్న భర్తకోసం, కన్నబిడ్డలకోసం, చిన్న చిన్న సుఖాలను గూడా వదులుకునే ఆడవాళ్ళున్నారు. ఆడదాన్ని త్యాగస్వరూపిణి అన్నవాడేమీ బడుద్ధాయి కాదు. వెళ్ళి మీ ఆంజనేయులతో చెప్పండి!"

మళ్ళీ మళ్ళీ కరెంటు వైరుపైన చేయి మోపుతున్నాను. షాకు తినక తప్పడం లేదు.

"ఫరవాలేదు. నేను తలుపు గడియ వేసుకుని పడుకుంటాను. మీరు వెళ్ళి నింపాదిగా అర్ధరాత్రిదాకా చూచిరండి" అంటూ సాగనంపింది సుబ్బులు.

సైకిలుసవారీ ప్రదర్శనానికి ప్రత్యే

కించి ఆ మైదానాన్ని ఎన్నుకోడంలో వున్న అంతరార్థం అక్కడికి వెళ్ళాక నాకు బోధపడింది. నే నక్కడికి వెళ్ళే సరికి మొదటి ఆట వదిలేశారు. థియేటరు నుంచీ బయటపడ్డజనంతో గుంపు ద్విగుణీకృతమైంది. గుంపుతోబాటుగా ఆంజనేయుల ఉత్సాహంగూడా పెరిగింది.

"అయ్యలారా! సైకిలంటే చక్రమని అర్థం. బైసికల్ అంటే రెండు చక్రాలన్నమాట! అందుకే అనువాదంలో యిది ద్విచక్ర శకటమైంది. స్టాండు వేయకుండా మీరొక సైకిలును నేలపైన నిల్చోబెట్టండి. సాధ్యంకాదు. పడిపోతుంది. కదిలితేనే, కదిలినంత సేపే దానికి భద్రత. మరైతే దానికింత నియమబద్ధమైన చలనం ఎలా సమకూరినట్టు? రెండు చక్రాలూ సమానంగా వుండడంవల్లనేనని మా భావం ! అవి ఏకోన్ముఖంగా, ఏకవేగంతో తిరగడం వల్లనేనని మా అవగాహన. సంసార శకటానికి భార్యాభర్తలిద్దరూ రెండు చక్రాలు. ఐతే యిప్పుడు మీ ఎదుట తిరుగుతున్న సైకిలులా ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోతున్న సంసారాలెన్ని? బొత్తిగా వుండవేమోనని మా అనుమానం? ఈ శకటంలో ఒక చక్రం పెద్దదైతే, యింకొకటి చిన్నది. ఒకటి తిమ్మి అంటే యింకొకటి బమ్మి. ఒకటి ఏటికి లాగితే, యింకొకటి కాటికి! మానవుడు నిర్మించిన సైకిల్లో రెండుచక్రాల కింత ఒద్దికవుండగా, భగవంతుడు సృష్టించిన స్త్రీపురుషుల్లో అదిలేకపోవడాన్ని ఏమనాలి; అదే మానవజాతి దురదృష్టం!''

నాకు నవ్వొచ్చింది. కామెర్లరోగి కళ్ళకంటే ఆంజనేయులు మనస్సు ఆరోగ్యవంతంగా లేదు. తనకున్న సమస్య నతడు పెద్ద భూతద్దంలోకి ప్రొజక్టుచేసి భీకరంగా చిత్రిస్తున్నాడు.

ప్రకటనలో చెప్పబడినట్టుగా పది గంటలకు ఫీట్లు ప్రారంభమయ్యాయి. ఐతే యిందులో ప్రధానపాత్ర వహించింది సైకిల్‌వాలీ కాదు. ఆవిడ భర్త. రెండు మూడు గంటలకు మునుపు నేను విన్న వర్ణన అతడి ఆకారానికి న్యాయం చేకూర్చిందనే చెప్పాలి. మరింత నిక్కచ్చిగా చెప్పడానికి కింకొక ప్రయత్నం: అతడి ఆకారం పెద్ద ఎలుగుబంటి వేషం వేయడానికి అనువుగా వుంటుందని చెబితే ఆమాట సత్యానికి మరింత చేరువగా వుంటుంది. ఒకవైపున భార్య తన సైకిలుపైన తాను తిరుగుతుండగా, అతడు పిట్టపిడుగులా తానింకొక సైకిలుపైకి దూకాడు. రెండు సైకిళ్ళు, రెండు ప్రాణాలు ఏ క్షణంలోనైనా ముక్కలు ముక్కలైపోవడం సంభవమేనన్న దిగ్భ్రమకు అవకాశం కల్పిస్తూ తుపాకీ గుండులా వలయాలు తిరిగాడు. ఉన్నట్టుండి చేతులు విడిచిపెట్టి, లేచి నిటారుగా నిలబడి, నడుముపైనుంచీ శరీర భాగాలను అష్టవంకరలు త్రిప్పుతూ రికార్డులో వినవస్తున్న సినిమాపాట కనుగుణ్యంగా ఒక వికటనాట్యం ప్రారంభించాడు. ఆ నాట్యవైభవాన్ని తిలకించి ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వడంలో అబ్బురం లేదు. స్వంత భార్యగూడా మునిముని నవ్వులు ఒలకబోయడమే విడ్డూరం!

అప్పటివరకది నాందీ వాచకమే. నిజమైన ఫీట్సు ఆ తరువాత జరిగాయి. కాళ్ళను హాండిల్‌బారుకడ్డంగా పైన వేసి, తల్క్రిందులుగా వుండి చేతులతోనే సైకిలు నడిపించడం, సైకిలు పరుగిడుతుండగానే దుస్తులు మార్చుకోడం, అప్పటికాసైకిలు పెద్ద సౌధరాజమైనట్టు, తానందులోని వివిధ భాగాల్లో సంచరిస్తున్నట్టు అతడు రకరకాల విన్యాసాలు చేశాడు. అయిదుగురు కుర్రవాళ్ళని ప్రక్కప్రక్కన పడుకోబెట్టి, అడ్డంగా సైకిలు త్రొక్కి, నడ్డివిరగకుండా, పొట్టచితికిపోకుండా వాళ్ళను బ్రతికిపోనిచ్చాడు. హఠాత్తుగా తనభార్య త్రొక్కుతున్న సైకిలుపైకి లంఘించి, ఆమె భుజాలపైన చేతులానించి గాలిలో పిల్లిమొగ్గలు వేశాడు. మొత్తానికి అతడి చేతిలో సైకిలు సైకిలు గాదు. కీలుబొమ్మ! అతడిమాట దానికి సుగ్రీవాజ్ఞ!

ఇంచుమించుగా అర్ధరాత్రప్పుడు యింటికి తిరిగివెళ్తుండగా, చల్లగా ఓ నీటి తుంపురు పైనపడినట్టు తోచి తల పైకెత్తి ఆకాశం వైపు చూచాను. మైదానంలో కారెనుముల్లా మబ్బుతునకలు కనిపించాయి. ప్రకృతికి ఆనందదాయిని వర్షం. కానీ ఆ క్షణాన వానరావచ్చునేమోనన్న వూహ నాకు అమంగళంగానే తోచింది,

ఆరోజు రాత్రి తెల్లవారుజామున ఉలికిపడి మేలుకున్నాను. ఇంటిపైకప్పు దడదడలాడిపోయేటట్టుగా జడివాన కురుస్తోంది.

లేచి లైటు వేశాను. అయిదుకింక అయిదు నిమిషాలుంది.

దుప్పటి పొరలమధ్య ముద్దలా ముడుచుకుని పడుకున్న సుబ్బులు "ఎందుకండీ, అప్పుడే లేచేశారు? పడుకోండి, పడుకోండి" అంటూ మందలించింది.

''కాదే సుబ్బులూ! పాపం, ఆసైకిలు త్రొక్కుతున్నావిడ తడిసి ముప్పందుమైపోయిందేమో!'' అన్నాను.

"మీరేం భయపడనక్కర్లేదు. ఇందాకా మీ స్నేహితుడు ఆంజనేయులు ఒక అత్యవసరమైన ప్రకటన చేశాడు. వెనుకసీటుపైన కూర్చుని మొగుడామెకు గొడుగు పడుతున్నాడట!"

"అలాగా! ఎంత మంచి గొడుగో చూశావా సుబ్బులూ!" అన్నాను, సంతోషంలో తడబడిపోతూ.

''ఆ మాత్రం మీరైతేనా! నా రాతకు




నన్ను వదిలిపెట్టి, వెచ్చగా యింట్లో కూచుందురు..."

"ఛాఛా! అలా ఎందుకు జరుగుతుంది సుబ్బులూ! శపిస్తే నువ్వు వానలోకి రావు. ఒకవేళ నేను వెళ్ళవలసివస్తే గొడుగిచ్చి పంపడానికి మరిచిపోవు..."

మరునాడు సోమవారం. టపాలో వచ్చిన అర్జంటు కాగితాలకు ప్రత్యుత్తరాలు వ్రాసిపెట్టడంతో ప్రొద్దుతిరిగింది. మధ్యాహ్నంమీదట ఆఫీసరుగారు పిలిపించి ఒకటి రెండు గంటల వ్యవధిలో క్యాంపుకి వెళ్ళడానికి సిద్ధంగా వుండమన్నారు. అవును మరి! క్యాంపుక్లర్కుకు ఎక్కడ తెల్లవారుతుందో, ఎక్కడ ప్రొద్దుపోతుందో వూహించడం కష్టం. రెండురోజుల్లో దాదాపు యిరవై వూళ్ళు తిరిగి, ఓపినన్ని వ్యవహారాలలో తలదూర్చి 'అబ్బ. క్యాంపు ముగిసింది' అనుకునేటప్పటికి ఆఫీసు గొడవలు మినహాగా మిగిలిన లౌకిక వాసనలన్నీ మనసులో నుంచి తుడిచిపెట్టుకపోయాయి. నన్ను దింపవలసినచోట దింపి జీపు ముందుకు వెళ్ళిపోయింది. అదలా వెళ్ళిపోయిన మరుక్షణంలో ఆంజనేయుల ప్రకటన నా చెవిలో పడింది!

"పెద్దలారా! పురజనులారా! మూడు రోజుల నిర్విరామ సైకిలుస్వారీ ప్రదర్శనం యింతకు మునుపే ముగిసింది. ఎండలో, చలిలో, వడగాలిలో, జడివానలో తొట్రుబాటులేకుండా, నిట్టూర్పు వదలకుండా ఈ కార్యాన్ని నిర్వహించిన ఆడపడుచుయొక్క ఓపిక, పట్టుదలను ఏమని కొనియాడగలం! మీరు కళ్ళున్నవాళ్ళు మాత్రమే గాదు. కాంచనేర్చినవాళ్ళుకూడా! తానే సైకిలుమీదనైతే ఈ మూడురోజుల వ్రతాన్ని సాకల్యంగా పూర్తిచేసిందో, అదే సైకిలుపైన బయలుదేరి ఆమె పట్టణంలో వీధివీధికీ వస్తూ వుంది. ఇంటింటి ముందరా ఆగుతుంది. పాత్రమెరిగి దానంచెయ్యండి. కష్టమెరిగి చెయ్యిసాచండి. కాపురమున్న నాలుగు గోడల కవతల ప్రళయం జరిగిపోయినా పట్టించుకోని అసూర్యంపశ్యలకిది చిట్టచివరి అవకాశం! శరీరాలు మీవికాదు గదా! ఎదుటి మనిషి కాశిదాకా ప్రాకినా మీకు పోయేదేముంది? డబ్బులివ్వకపోతే మానె! నిబ్బరంగా, కిటికీ చువ్వలగుండానైనా ఈమె వైపొకసారి చూడండి, చాలు, అదే పదివేలు!''

* * *




మరునాటి ఉదయం ఏడుగంటలకల్లా మా యింటిదగ్గర హాజరయ్యాడు ఆంజనేయులు. కళ్ళు అరంగుళం లోతుకు పోయివున్నాయి. బట్టలు మసిపాతల్లా మాసిపోయాయి. గడ్డం పెరిగింది. ఆ వాలకం చూస్తుంటే అతడు సినిమాహాలు మైదానంలో వేసుకున్న గుడారాన్ని వదిలిపెట్టి గడిచిన మూడు రోజుల్లో ఒక్కసారైనా యింటి ముఖం చూచినట్టులేదు.

"ఏం నాయనా! మీ నిఘా సంఘం రాత్రి ఎన్ని గంటలకు రద్దయింది?'' అని అడిగాను.

నీతో నాకేంపని లెమ్మన్నట్టు నిరుత్తరుడై, నిర్లిప్తుడై, నిస్సారంగా కుర్చీలోకి చేరగిలబడిపోయాడు ఆంజనేయులు.

"పలకరేమండీ అన్నగారూ! ఆ సైకిలు త్రొక్కిన పుణ్యాత్మురాలిని ఏ ఆస్పత్రిలో చేర్చారు?" అంటూ ఎద్దేవా చేసింది సుబ్బులు.

"ఆ మాటెత్తకండక్కయ్యగారూ! ఆమెను గురించి తలచుకుంటే నాకు ఏడుపొస్తుంది" అన్నాడు ఆంజనేయులు; నిజంగానే ఏడుపుమొగంపెట్టి!

"ఎందుకు బాబూ! ఏమైంది? కష్టానికితగ్గ సంపాదన దొరకలేదా ఏమిటి?" బుజ్జగించినట్టుగా అడిగాను.

''డబ్బుమాట గాదయ్యా సీతాపతీ! డబ్బుదేముంది! మూడురోజుల వసూళ్ళ మొత్తం వెయ్యికి తగ్గివుండదు. అందును గురించి కాదు నా బాధ! ఇంత సంపాదించింది గదా! ఇందుకోసం ఒళ్ళొక వరస హూనమైపోయింది గదా! ఏం లాభం చెప్పు! ఆ మొగుడంటే ఈ పెళ్ళానికి సింహ స్వప్నమనుకో! వాడు 'డూయ్' మన్నాడంటే, ఈవిడ కుందేలు పిల్లలా బెదిరిపోవడమే! తన చేతికయిదులొచ్చినా, వదులొచ్చినా వాడికే దత్తం! వాడి అనుగ్రహానికి తానెందుకు ప్రాకులాడాలయ్యా. యింకా వాడే ఈమె అడుగులకు మడుగులొత్తాలి గానీ! కొందరాడవాళ్ళు పూలలోపెట్టుకు పూజించినా, నెత్తికెక్కి స్వారీచేయజూస్తారు. వాడడిగొచ్చిన అదృష్టమేమిటో మరి!"

"అదేమీ బ్రహ్మరహస్యం గాదు. ఆలోచించివుంటే నీకైనా స్ఫురించేదే! మూడురోజులుగా వేళకు సరిగా తిండిలేక, సరిగ్గా నిద్రలేక నీబుర్ర వేడెక్కిపోయివుంటుంది'' అన్నాను.

''పోనీ, నువ్వు చెప్పరాదా?'' అన్నాడు.

''ఏం లేదు. సైకిలు త్రొక్కుతుంది గదా! ఆమె కిక్కడ యిల్లులేదు. వాకిలిలేదు. నా అన్నవాళ్ళు లేరు. వెయ్యి రూపాయలు సంపాదించిందా! దాన్ని దాచిపెట్టుకోడానికి యినప్పెట్టె లేదు, ఐనా ఆమె నిర్భయంగా వుండగలుగుతోంది. ఈ భద్రత ఆమెకు లభించిన 'సోర్సు' ఏదంటావు?''

చుట్టుప్రక్కల ఎక్కడో సుబ్బులుంటుందని తెలుసు. ఎందుకైనా మంచిదని గొంతు తగ్గించి కాస్తా మెల్లగానే ముగించాను— ఆడది దీప మనుకో ఆంజనేయులూ! మగవాడే గాజుకుప్పె!"

అనుకున్నంతా అయింది. బుడుంగున స్టోరురూములో నుంచీ బయటికొచ్చింది సుబ్బులు— ''అంతటితో నిలిపేయకండి! మగవాడు గాలిపటమైతే ఆడదే నూలుదారమనిగూడా చెప్పండి! నిదర్శనానికి ఎంతో దూరం పోనక్కర్లేదు. ఆరునెలలు ఖాయిలాపడిలేచినట్టున్న ఆంజనేయులన్నయ్య ముఖం చూస్తేనే చాలు!''

శంకరాచార్యులకు తగిన ఉభయభారతే దొరికింది గనుక నా పని తేలికైపోయింది!

"నేనూ నూలుతెగిన గాలిపటమేననుకోండి అక్కయ్యగారూ! కానీ చిమ్నీ లేకపోయినా తనకేమీ ఫరవా లేదన్న ధీమా నా భార్య కెలా వచ్చిందంటారు?''

"ఏముంది? నెలల తరబడీ పోషించగల తల్లిదండ్రులున్నారు. పైగా తన పేరిట బ్యాంకులో కొంత డబ్బుగూడా వుండిపోయింది. ఈ హంగులవల్ల తనకు ఒరిగేదేమీలేదని తెలిసిపోతే, అప్పుడామెగారి కవళం తలతిరిగి నోటిదగ్గరికొస్తుంది...''

"అందు కుపాయం?''

"రెండో పెళ్ళి చేసుకోబోతున్నానని లాయరు ద్వారా నోటీసివ్వించండి!"

'ఆఁ ఆఁ' అంటూ నోరు తెరిచేశాడు ఆంజనేయులు. ఆయిదు నిమిషాల తర్వాత కాస్తా తెప్పరిల్లుకున్నట్టుగా కళ్ళుతెరిచి "అయితే అక్కయ్యగారూ! అలా చేయమంటారా?" అన్నాడు.

అంత పనీ చేసేటట్టే వున్నాడు ఆంజనేయులు. మిగిలిన కథను వెండితెరపైన చూడడానికి నేనూ సిద్ధమే! ✱